

పశ్చిమలో గణపవరం విలీనం

30 రోజుల్లో అభ్యంతరాలు తెలపాలి: కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఏలూరు జిల్లాలోని గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలో విలీనం చేస్తూ ఈ నెల 10న ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని, దీనిపై అభ్యంతరాలుంటే 30 రోజుల్లో తెలపాలని కలెక్టర్ ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలను ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల అధికారులకు తెలియజేయవచ్చునని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి తదుపరి చర్యలకు ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు.

నిరసన హక్కును కాలరాయడం దుర్మార్గం

మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ కొనసాగిన ఆందోళనలు

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర విభజన సందర్భంగా పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయని ప్రధాని నరేంద్ర మోడీకి రాష్ట్రంలో పర్యటించే హక్కు లేదంటూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నాయకుల అక్రమ అరెస్టులను వామపక్షాలు తీవ్రంగా ఖండించాయి. భీమవరం ప్రకాశంచౌక్ సెంటర్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో నల్ల జెండాలతో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, పట్టణ కార్యదర్శి సిహెచ్.రంగారావు, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంక కష్ణమూర్తి మాట్లాడారు. నిరసన తెలిపే హక్కును కాలరాయడం దుర్మార్గమన్నారు. ఎనిమిదిన్నరేళ్ల పాలనలో బిజెపి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకిచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. ప్రధాని మోడీని కలిసి మాట్లాడామని, రాష్ట్రానికి మంచి రోజులు తెస్తామని గొప్పలు చెప్పుకొంటున్న జనసేన పవన్ కల్యాణ్ విశాఖ ఉక్కును ప్రయివేటీకరించబోమని ఎందుకు ప్రకటన చేయించలేదో ప్రజలకు చెప్పాలన్నారు. టిడిపి సైతం రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న మోడీని ప్రశ్నించే స్థితిలో లేకపోవడం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యమన్నారు. వైసిపి, టిడిపి, జనసేన మోడీ అడుగులకు మడుగులొత్తడాన్ని మాని రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి, ఎపి మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, వామపక్షాల నాయకులు ఎం.సీతారాం ప్రసాద్, దండు శ్రీనివాసరాజు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, మల్లుల శ్రీనివాస్, ఆకలి రాము, ఎం.ఆంజనేయులు, డి.నాగు, వైవి.ఆనంద్, ఎం.లక్ష్మిపతి, పాలా త్రిమూర్తులు, కె.వెంకటేశ్వరరావు, బి.శ్రీను, పి.నారాయణ పాల్గొన్నారు.



భీమవరంలో..

వీరవాసరం: ప్రధాని మోడీ రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. తూర్పు చెరువు సెంటర్ వద్ద మోడీ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటు పరం చేయడం విరమించుకోవాలని, ఎపికి ప్రత్యేక హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బొబ్బనపల్లి సూర్యచంద్రరావు, యండమూరి సుబ్బారావు, తాళ్లూరి రాము, లింగం సత్యనారాయణ, నున్నబోయిన సత్యనారాయణ పాల్గొన్నారు.

నరసాపురం: రాష్ట్రానికి తీవ్ర ద్రోహం అన్యాయం చేసిన మోడీ గో బ్యాక్ అంటూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్లో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడారు. పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన వాగ్దానాలను బిజెపి ప్రభుత్వం తుంగలోకి తొక్కిందన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు మంచిలి నీలకంఠం, పొన్నాడ రాము, బొడసింగు అప్పారావు, వాస రామలింగం, సోమేశ్వరరావు, శివరాజు తదితరులు పాల్గొన్నారు.



నరసాపురంలో..

ఆకివీడు: మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని సిపిఎం పట్టణ కార్యదర్శి కె.తవిటి నాయుడు అన్నారు. మోడీ రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ స్థానిక గాంధీ బొమ్మసెంటర్ వద్ద శనివారం సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పెంకి అప్పారావు, బివి వర్మ, రవితేజ, పెట్ట పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

నాడు భార్య.. నేడు కుమార్తె

ఇరువురు అనుమానాస్పద మృతి

ముద్దాపురంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతిపై కలకలం

ప్రజాశక్తి - తణుకురూరల్

మండలంలోని ముద్దాపురంలో ముళ్లపూడి నాగహారిక(19) అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం ఆ ప్రాంతంలో కలకలం సృష్టించింది. దీనికి సంబంధించి తణుకు రూరల్ పోలీసులు, బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగహరిక తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలోని వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ రెండో సంవత్సరం కళాశాల హాస్టల్లో ఉంటూ చదువుతోంది. అయితే ఇటీవల హాస్టల్ నుంచి వచ్చేసి ముద్దాపురంలో ఇంటి నుండి కళాశాలకు వెళ్తోంది. శుక్రవారం రాత్రి ఇంట్లోని పై పోర్షన్‌లోని తన గదిలో నిద్రపోయింది. శనివారం తెల్లవారుజామున ఆ ఇంటి పైనుండి పొగలు రావడంతో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. నాగహారిక పడక గది పూర్తిగా కాలిపోయి మంచం ఫ్రేమ్ లోపల కింది భాగంలో ఆమె పడి ఉంది. నాగహారిక తండ్రి శ్రీను గతంలో తాడేపల్లిగూడెం మండలం కృష్ణాయపాలేనికి చెందిన వసంతకుమారిని వివాహం చేసుకున్నాడు. హారిక ఎనిమిది సంవత్సరాల వయస్సులో వసంతకుమారి


నాగహారిక (ఫైల్‌ఫోటో)

ముద్దాపురంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆ కేసులో శ్రీను నిందితునిగా ఉన్నాడు. ఆ తర్వాత భీమడోలు మండలం అంబరపేటకు చెందిన రూపను వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమార్తె ఉంది. శ్రీను గతంలో పార్ట్‌టైం లెక్చరర్‌గా పని చేశాడు. శ్రీను చింతలపూడిలో ఎనిమిదెకరాలు, ముద్దాపురంలో రెండు ఎకరాలు వ్యవసాయం చేస్తున్నాడు. రూప వైసిపి మహిళా విభాగం తణుకు మండల అధ్యక్షురాలిగా నియమితురాలైంది. ఇటీవల ముద్దాపురంలో శ్రీను డూప్లెక్స్ భవనాన్ని నిర్మిస్తున్నాడు. భవనం పూర్తయ్యిందని, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమకూర్చే పనిలో ఉన్నాడు. గతంలో మొదటి భార్య వసంతకుమారి అనుమానాస్పద మృతి కేసులో నిందితునిగా శ్రీను ఉండటం, కుటుంబ కలహాల నేపథ్యంలో ఇప్పుడు నాగహారిక అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం ఆ ప్రాంతంలో కలకలం సృష్టించింది. హారికను శుక్రవారం రాత్రి సమయంలో కొట్టి చంపిఉంటారని, ఆపై పెట్రోల్ పోసి ప్రమాదంగా చిత్రీకరించి ఉంటారని వసంతకుమారి తల్లిదండ్రులు, గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. సంఘటనా స్థలాన్ని క్లూస్‌టీం పరిశీలించి ఆధారాలు సేకరించింది. సిఐ ఆంజనేయులు, ఎస్ఐ రాజకుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తణుకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

18న సిఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ఈ నెల 18న శుక్రవారం ముఖ్యమంత్రి జగన్ నరసాపురం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సిఎం పర్యటనా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ సూర్యతేజ మాట్లాడుతూ ఫిషింగ్ హార్బర్, వాటర్ గ్రిడ్, ఆక్వా యూనివర్సిటీ, ఆర్‌టిసి బస్టాండ్, వంద పడకలు ఆసుపత్రి, సబ్‌స్టేషన్ తదితర పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. 25వ వార్డు నక్కావారిపేట వీవర్స్ కాలనీలో బహిరంగ సభ, చినమామిడిపల్లి లేఅవుట్‌లో హెలీప్యాడ్‌కు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. శాఖలవారీగా కేటాయించిన పనులు, ఎంతవరకూ పూర్తి చేశారు, మిగిలిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి పర్యటనా ఏర్పాట్లలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఒక ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొగల్తూరు: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటనకు ప్రజలందరూ తరలిరావాలని వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు కోరారు. చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఆదేశాల మేరకు శనివారం ఉదయం నుంచి మండలంలోని గ్రామాల్లో ప్రజలకు ఆహ్వాన పత్రాలు అందించామన్నారు.

నరసాపురం టౌన్: ఈ నెల 18న నరసాపురం నియోజవర్గంలో సిఎం జగన్ పర్యటనలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని రాజుల్లంక సర్పంచి వేగేశ్న సీతారామరాజు కోరారు. శనివారం ఉదయం నుంచి సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ ఆహ్వాన పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఎంపిటిసి కడలి లక్ష్మిదుర్గశ్రీనివాస్, ఉపసర్పంచి కడలి కుటుంబరావు, లక్ష్మణేశ్వరం ఆలయ కమిటీ ఛైర్మన్ కంకటాల పెద్దిరాజు, వైసిపి నేతలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.


మాట్లాడుతున్న సూర్యతేజ

పేదలకు తాగునీటిని అందించాలి

ఎపి వృకాస జిల్లా మహాసభ డిమాండ్ - సంఘం నూతన కమిటీ ఎన్నిక


బి.జార్జి జె.సత్యనారాయణ

ప్రజాశక్తి - భీమవరం

ఆక్వా కాలుష్యం నుండి గ్రామీణ పేదలను రక్షించి శుద్ధి చేసిన తాగునీటిని అందరికీ అందించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఒక తీర్మానాన్ని ఆమోదించింది. దీనికి సంబంధించిన వివరాలను ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ పత్రికలకు విడుదల చేశారు. శృంగవృక్షంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలోని జరిగిన మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నామని, అలాగే పలు అంశాలపై తీర్మానాలు చేశామని, వాటి సాధన కోసం రానున్న రోజుల్లో పోరాటాలు చేపడ తామని తెలిపారు. ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షిం చాలని, కనీసం వేతనం రూ.600 ఇవ్వాలని, పని దినాలు 200కు పెంచాలని, రెండు పూటలా పని మస్తర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని, బడ్జెట్లో రెండు లక్షల కోట్లు కేటాయించాలని మహాసభ కోరింది. జగ నన్న కాలనీల్లో మౌలిక సౌకర్యాలు కల్పించి ఇంటి నిర్మాణ రుణాన్ని రూ.ఐదు లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేసింది. నవరత్నాలతోపాటు పదో రత్నంగా ప్రభుత్వ భూములను పేదలకు పంచే రత్నాన్ని చేర్చాలని, రెండు పంటలు పండే సారవంతమైన వరిసాగు భూములను ఆక్వా చెరువులుగా మార్పు చేయకుండా ఆపాలని, విద్య, వైద్యాన్ని పేదలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతూ మహాసభ ఏకగ్రీవంగా తీర్మానాలు ఆమోదించిందని జార్జి, సత్యనారాయణ తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

జిల్లా అధ్యక్షులుగా బాతిరెడ్డి జార్జి, జిల్లా కార్యదర్శిగా జక్కంశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా కండెల్లి సోమరాజు, కౌరు పెద్దిరాజు, జె.వెంకటలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా బల్ల చినవీరభద్రరావు, శేషపు అశ్రియ్య, ఎడ్ల చిట్టిబాబు, మరో 15 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - తణుకురూరల్

మండలంలోని ముద్దాపురం, దువ్వ గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పి.ప్రశాంతి, నర్సాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఏవిధంగా కొనుగోలు చేస్తున్నారో కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కల్లాల్లో రైతులు ఎండబెట్టుకున్న ధాన్యాన్ని పరిశీలించి అందులో తేమ ఎంత శాతం ఉందో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్ధారు పిఎన్‌డి ప్రసాద్, ఎంపిడిఒ సూర్యనారాయణమూర్తి, వ్యవసాయ శాఖ, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.


తణుకు రూరల్: రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

తాడేపల్లిగూడెం: జిల్లాలో రైతులకు ఎటువంటి ఇబ్బందీ తలెత్తకుండా రైతుల వద్ద నుండి ధాన్యం సక్రమంగా కొనుగోలు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని కృష్ణయ్యపాలెం, యాగర్లపల్లిలోని రైతుభరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. రైతులకు అవసరమైన గోనె సంచులను ముందుగానే సరఫరా చేయాలని కోరారు. రైతుల ధాన్యం డబ్బుతో సహా రవాణా ఛార్జీలు కూడా రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని ఆదేశించారు. అనంతరం ఉల్లిపాయల మార్కెట్లో ఉన్న వేయింగ్‌మిషన్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ దాసి రాజు, సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ టి.శివరామ ప్రసాద్, డిఎస్‌ఒ ఎన్.సరోజ, తాడేపల్లిగూడెం తహశీల్దార్ అప్పారావు, ఎంపిడిఒ వెంకటేశ్వరరావు, రైతుభరోసా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

సందీప్‌కు ఉత్తమ యువ ఇంజినీర్ అవార్డు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


నిట్‌లోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఉద్దంటి సందీప్ జాతీయస్థాయిలో ఉత్తమ యువ ఇంజినీర్ అవార్డును అందుకున్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా (ఐఇఐ, కోల్‌కత్తా) 2021-22 సంవత్సరానికి సంబంధించి మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో నిర్వహించిన 37వ ఎలక్ట్రికల్ ఇంజినీర్ల జాతీయ సమావేశంలో ఈ పురస్కారాన్ని సందీప్‌కు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా సందీప్‌ను నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్‌లు డాక్టర్ జిఆర్‌కె.శాస్త్రి, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ టి.కురుమయ్య, డాక్టర్ జిబి.వీరేష్‌కుమార్, పలువురు విభాగాధిపతులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో అవార్డును అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, భవిష్యత్తులో మరిన్ని ఆవిష్కరణల రూపకల్పనకు కృషి చేస్తానని తెలిపారు.

ప్రభుత్వాసుపత్రిలో చీఫ్ విప్

సౌకర్యాలపై ఆరా

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం ప్రభుత్వ చీఫ్ విప్, ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు వార్డుల్లో తిరిగి ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి అక్కడి రోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చేరే గర్భిణులు, బాలింతల విషయంలో జాగ్రత్తలు తీసుకుని ఎటువంటి ఇబ్బందులూ ఎదురవ్వకుండా చూడాలని వైద్యులను ఆదేశించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవనాలను పరిశీలించారు. ప్రస్తుతం 50 పడకల ఆసుపత్రిగా ఉన్నదాన్ని వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ నెల 18న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆసుపత్రి ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. ఎంఎల్ఎ వెంట మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె వెంకటరమణ, వైస్ ఛైర్‌పర్సన్ కామన్ నాగిని, వైసిపి కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రభుత్వాసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న ప్రసాదరాజు

16, 17 తేదీల్లో సిఐటియు జిల్లా మహాసభ

ప్రజాశక్తి - ఉండి

ఈ నెల 16, 17 తేదీల్లో పాలకొల్లులో జరిగే సిఐటియు జిల్లా మహాసభను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ పిలుపునిచ్చారు. శనివారం సిఐటియు మండల మహాసభ స్థానిక వెంకటేశ్వరస్వామి కళ్యాణ మండపంలో నిర్వహించారు. సభకు నిమ్మిితి కిషోర్, కడలి నాగేశ్వరరావు, రామకూరి వెంకటరత్నం అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ముఖ్యఅతిథి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనం అమలు కాక చాలీచాలని జీతాలతో నిత్యం పెరుగుతున్న ధరలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లోనూ పనిచేసే కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు నష్టం చేసేలా తీసుకొచ్చిన లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ధనికొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షునిగా వీరవల్లి మాధవరావు, కార్యదర్శిగా కొట్టాడ వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా దేవి, విజయలక్ష్మి, కోశాధికారిగా నిమ్మితి కిషోర్, సభ్యులుగా పది మందిని ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న జెఎన్‌వి.గోపాలన్

గుండెలపై కుంపటి ఎన్నాళ్లు..!

కడియద్ద ఘటనతో మరోసారి తెరపైకి బాణసంచా ప్రమాదాలు

ఆకివీడు, పెదవెల్లమిల్లి ఘటనలపై సర్వత్రా చర్చ

ధాన్యం కొనుగోళ్లు ఇలాగేనా



'కడియద్ద' ఘటన నాలుగు శ్రమజీవుల ప్రాణాలను బలిగొంది. అదే సమయంలో అన్ని అధికారిక వ్యవస్థల పర్యవేక్షణా లోపాలను ఎత్తిచూపింది. అప్పుడే కునుకు తీసేందుకు సిద్ధమవుతున్న పల్లెలో చోటుచేసుకున్న పేలుడు ఘటనతో సమీప ప్రాంతాలన్నీ భూకంపం వచ్చినట్లు దద్దరిల్లాయంటే తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఘటన జరిగిన వెంటనే సమీపప్రాంత ప్రజలు కూడా వెళ్లేందుకు సాహసించలేని పరిస్థితి నెలకొనడం వెనుక అన్ని అధికారిక వ్యవస్థల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. గతంలో పెదవెల్లమిల్లి, ఆకివీడు తదితర ప్రాంతాల్లో చోటుచేసుకున్న బాణాసంచా పేలుడు ఘటనలు చోటుచేసుకోవడం, మరణాలు సంభవించిన సంగతి అందరికీ తెలిసిందే. ఆ సమయంలోనూ విచారణ పేరిట హడావుడి చేయడం ఆపై అంతా మరిచి పాత పరిస్థితులే కొనసాగుతున్నాయనడానికి కడియద్ద ఘటనే నిదర్శనం. అన్నిచోట్లా అక్కడ పనికొచ్చిన కూలీలే మృత్యువాత పడుతున్నారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందే ఎక్స్‌గ్రేషియా మినహా మరే సాయమూ లేక ఆయా కుటుంబాలకు రోడ్డున పడుతున్నాయి. బాణసంచా తయారీ, నిల్వకు అక్కడ అనుమతి ఉందని అంతా చెబుతున్నారు. అది వాస్తవమే అయ్యి ఉండొచ్చు. అంటే పేలుడు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించిన ఏర్పాట్లన్నీ చేయకుండానే అధికారులు అనుమతులిచ్చేశారా. అలాగైతే గుడ్డిగా అనుమతులిచ్చిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలి. లేక అన్ని ఏర్పాట్లు చేసినా పేలుడు సంభవించిందా అంటే దానికి గల కారణాలను వెలికితీయాలి. ప్రాథమిక సమాచారం ఆధారంగా పరిశీలిస్తే సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడమే కాకుండా అనుమతులకు మించిన సామర్థ్యంతో అక్కడ పేలుడు సామగ్రి ఉన్నట్లు తెలుస్తోంది. దీన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన సంబంధిత శాఖాధికారులు ఏం చేస్తున్నారో తేల్చాలి. పోనీ సంబంధిత అధికారులంతా ఆ యజమానిని హెచ్చరించినా చర్యలు తీసుకోకుండా రాజకీయ పెద్దల జోక్యం ఉంటే ఆ విషయాన్ని బట్టబయలు చేయాలి. అదేమీ లేకుండా సామర్థ్యానికి మించి నిల్వలున్నాయని ఒకరిద్దరు అధికారులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంటే శ్రమజీవుల ప్రాణాలకు విలువ లేకుండా చేసినట్లే. ఇప్పటికైనా దీనిపై లోతుగా విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టి అధికారిక వ్యవస్థల్లో లోపాలను సరి చేయడంతోపాటు రాజకీయ పెద్దల జోక్యాన్ని నివారించేలా చర్యలు తీసుకుంటే ఈ ఘటనలు పునరావృతం కాకుండా, కూలీల ప్రాణాలు బలికాకుండా ఉండే అవకాశం ఉంది. మరి పాలకులు, జిల్లా అధికారులు ఎలా ముందుకు సాగుతారో వేచిచూడాలి.

ధాన్యం కొనుగోళ్లు ఇలాగేనా

సార్వా వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. చాలాచోట్ల కోతలు ప్రారంభమై 20 రోజులు దాటింది. అయితే ధాన్యం మాత్రం కల్లాలు దాటి ఆర్‌బికెలకు చేరడం లేదు. ప్రధానంగా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడమే దీనికి కారణం. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించిన ఉంగుటూరు మండలంలో ఆదిలోనే హంసపాదులా సాంకేతిక సమస్యలు అటు రైతులను, ఇటు అధికార యంత్రాంగాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఇప్పటికే రైతులు 20 రోజులుగా ఒకపక్క వాతావరణ మార్పులు, మరోపక్క ధాన్యం ఎక్కడ అమ్మాలో తెలియక సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో సాంకేతిక సమస్యలు రైతులకు గోరుచుట్టుపై రోకటి పోటులా పరిణమించాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి సాంకేతిక సమస్యలు పరిష్కరించడంతోపాటు నిబంధనలు సడలించి త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీంతోపాటు ఆర్‌బికెలకు ధాన్యం అప్పగించిన 15 నుంచి 20 రోజుల్లేనే సొమ్ము ఖాతాల్లో జమైతే రైతులకు ఎంతోకొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది. ఆ దిశగా పాలకులు చర్యలు తీసుకుంటారో లేక దాళ్వా సీజన్ తరహాలోనే రైతుల గుండెపై కుంపటి రగిలిస్తారో వేచిచూడాలి.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

విద్యాదాత మూర్తిరాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చింతలపాటి మూర్తిరాజు విద్యా దాత అని, ఆయన సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి సర్రాజు అన్నారు. శనివారం జెపి రోడ్డులోని అడ్డవంతెన వద్ద ఉన్న మూర్తిరాజు విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. శ్రీవిజ్ఞాన వేదిక, విశ్వశాంతి వృద్ధాశ్రమం, అల్లూరి సీతారామరాజు సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాతపాటి విచ్చేసి మాట్లాడారు. మూర్తి రాజు ఒక వ్యక్తి కాదు ఒక మహా సంస్థ అని సంబోధించారు. శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ సుమారు 2 వేల ఎకరాలు, జిల్లాలో 55కు పైగా విద్యాలయాలు స్థాపించిన దాతృత్వమూర్తి మూర్తి రాజు అని కొనియాడారు. అల్లూరి సీతారామరాజు సేవాసమితి అధ్యక్షులు మాజీ రాజు సుబ్బరాజు మాట్లాడుతూ ఆయన నిస్వార్థ ప్రజా సేవకుడిగా పేరుగాంచారన్నారు. విశ్వశాంతి, చినమిరం వృద్ధాశ్రమ నిర్వాహకులు జి.రామరాజు, కృష్ణంరాజు, బి.సత్యనారాయణ రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ లావణ్య

పాలమూరులో ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం శనివారం పొలమూరు గ్రామ సచివాలయం-2 కావు కళ్యాణ మండపంలో సర్పంచి కకర రాజేశ్వరరావు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.లావణ్య మాట్లాడుతూ సెక్షన్లో జనరల్ ఒపి, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు వైద్య సేవలందించామన్నారు. మధ్యాహ్నం పితానికాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు స్కానింగ్ చేసి తగిన చికిత్స అందించడం జరిగిందన్నారు. మంచం మీద నుంచి లేవలేని రోగుల ఇంటికి వెళ్లి చికిత్స అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి కలిదిండి భాస్కర సత్యనారాయణ రాజు (దినేష్‌రాజు), ఎంపిటిసి మాదిరెడ్డి నాగదుర్గ, పెద్దిరెడ్డి నరసింహమూర్తి, 104 డాక్టర్ జి.అనూష, హెల్త్ అసిస్టెంట్ ఆర్.వేణు గోపాలస్వామి, ఎంఎల్‌హెచ్‌పిలు డి.శ్రీనివాస్, జి.స్వరూప పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా 14 రకాల వైద్య సేవలు, 67 రకాల మందులు అందుబాటులో ఉంచడం జరుగుతుందని ఎల్బిచర్ల పిహెచ్‌సి డాక్టర్ పి.నిహారిక తెలిపారు. శనివారం సారవలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిహారిక మాట్లాడుతూ వైద్యం కోసం ఆసుపత్రికి రావాలంటే రోగులకు చాలా కష్టంగా ఉంటుందని, ఈ శిబిరం ద్వారా గ్రామంలోని వైద్య సేవలు అందించేందుకు వీలవుతుందని తెలిపారు. మొత్తం 73 మంది రోగులు ఈ శిబిరం ద్వారా వైద్య సేవలు పొందారన్నారు. ఈ శిబిరంలో 104 వైద్యుడు సిహెచ్ సుధాకర్, వైద్య సిబ్బంది, ధనలక్ష్మి పాల్గొన్నారు.

14న ఆక్వారైతుల పోరుబాట

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల14వ తేదీ ఉదయం 10 గంటలకు భీమవరం - ఉండి విద్యుత్ సబ్ స్టేషన్ దగ్గర జరిగే ఆక్వారైతు పోరుబాటలో ఆక్వా రైతులు కదిలివచ్చి కదంతొక్కాలని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. ఆయన పాలకొల్లులో శనివారం మీడియాతో మాట్లాడుతూ రొయ్యల ధరలు రోజురోజుకీ పతనమవుతున్నాయని, ఫీడ్ ధరలు పెరుగుతున్నాయని దీంతో ఆక్వారైతులు కుదేలవుతున్నారని చెప్పారు. ఆక్వా విద్యుత్ సబ్సిడీని ఆక్వాజోన్, నాన్ ఆక్వాజోన్ అంటూ, 10 ఎకరాల్లోపు అంటూ అర్థం లేని నిబంధనలు పెట్టి ఆక్వా రైతుకు విద్యుత్ సబ్సిడీని ఎత్తివేస్తున్నారని చెప్పారు. ఆక్వా రైతులకు న్యాయం జరిగేంత వరకూ ఉద్యమిస్తామని చెప్పారు. నిరసనలో ఉభయగోదావరి జిల్లా ఇన్‌ఛార్జి ప్రత్తిపాటి పుల్లారావు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, మాజీ మంత్రులు జవహర్, పీతల సుజాత, పితాని సత్యనారాయణ, ఎంఎల్‌సిలు పాల్గొంటారని తెలిపారు.

అధ్వానంగా సిద్ధాంతం శ్మశానవాటిక

ప్రజాశక్తి - పెనుగొండ

సిద్ధాంతం శ్మశానవాటిక చెత్తా చెదారాలతో అధ్వానంగా ఉందని సిపిఎం నాయకులు కప్పల రత్నరాజు, బృందం సభ్యులు తెలిపారు. శనివారం శ్మశానవాటికను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చుట్టుపక్కల 30 గ్రామాలకు సిద్ధాంతం శ్మశానవాటిక ఒక్కటేనని తెలిపారు. అయితే సిద్ధాంతం గ్రామ పంచాయతీలోని చెత్తను శ్మశానవాటికలో వేయడంతో అధ్వానంగా తయారైందని తెలిపారు. దీంతో దుర్వాసన వెదజల్లుతూ ఖననానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణం శ్మశానవాటికలో చెత్తను తొలగించి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

బాధితులకు పితాని పరామర్శ

ప్రజాశక్తి - పోడూరు

గుమ్ములూరులో ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందిన పితాని వెంకటేశ్వరరావు, నక్కా మాధవిని శనివారం మాజీ మంత్రి పితాని సత్యనారాయణ పరామర్శించారు. ఆయన వెంట మండల అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, గణపతినీడి రాంబాబు, వర్ధనపు రాజమణి, కడలి నాగలక్ష్మి ఉన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కార్తీక్

మెరుగైన వైద్య సేవలందిస్తాం : డాక్టర్ కార్తీక్

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - పెనుమంట్ర

నిత్యం రోగులకు అందుబాటులో ఉంటూ ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు మార్టేరు పిహెచ్‌సి డాక్టర్ కె.కార్తీక్ అన్నారు. ఈ నెల 10వ తేదీన ప్రజాశక్తి పత్రికలో అందుబాటులో ఉండని పిహెచ్‌సి వైద్యులు శీర్షికన ప్రచురితమైన వార్తకు శనివారం డాక్టర్ కె.కార్తిక్ స్పందించారు. కొంత మంది కిట్టని వాళ్లు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో నెలలో 3వ బుధవారం ఈ నెల 16వ తేదీన పెనుగొండలోని సచివాలయం-4లో, 21, 23 తేదీల్లో మార్టేరు-2లో, నెగ్గిపూడిలో ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా వైద్య సేవలందిస్తామని తెలిపారు.

సాగరతీరం.. కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని పేరుపాలెం బీచ్ శనివారం పర్యాటకులతో కళకళలాడింది. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, పాఠశాలలకు రెండో శనివారం సెలవు రోజు కావడంతో పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు బీచ్‌కు ఉదయమే తరలివచ్చారు. సముద్ర స్నానాలు చేశారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సర్వే, కొబ్బరితోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేదతీరారు. బీచ్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

పందుల స్వైరవిహారం!

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో పందుల సమస్య నానాటికీ జఠిలమవుతోంది. దాదాపు దశాబ్దాల నుంచి పట్టణంలో పందుల పెంపకందార్లు వాటిని వృత్తిగా పెంచుతున్నారు. వాటిని చంపరాదని కేవలం బర్త్ కంట్రోల్ చేయాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నా మున్సిపాలిటీ వారు ఏంచేయలేకపోతున్నారు. పలుమార్లు వాటిని పట్టి అడవుల్లో వదిలినా పందుల పునరుత్పత్తిని అరికట్టలేకపోతున్నారు. పశు వైద్యాధికారులతో సంతాన నిరోధక చర్యలు తీసుకోవాలని భావించినా ఈ పథకం ఆరంభంలో అమలు కాలేదు. దీంతో పట్టణంలో వేలాదిగా పందులు సంచరిస్తూ పారిశుధ్య సమస్యలు తెస్తున్నాయి. మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ పందుల సమస్యను అరికట్టడానికి సచివాలయ సిబ్బందితో సమావేశాలు పెడుతున్నా ఫలితం లేదు. పట్టణంలో దాదాపు అన్ని వార్డులు, వీధుల్లో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. పలు రోగాలకు కారణం అవుతున్నాయి. జిల్లా యంత్రాంగం పందులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. మున్సిపల్ కౌన్సిల్ లేక పోవడంతో మున్సిపల్ అధికారులకు జవాబుదారీతనం లేకుండా పోయింది. ఒకవైపు తడి చెత్త, పొడి చెత్త అంటూ ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తున్నా సమస్య తీరడం లేదు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కవురు శ్రీనివాస్ పందుల సమస్యపై సమావేశం నిర్వహించిన దాఖలాలు లేవు. దీంతో ప్రజలు పందులు, పారిశుధ్య సమస్యతో నిత్యం సతమతమవుతున్నారు.




పాలకొల్లులో విచ్చలవిడిగా తిరుగుతున్న పందులు

ఆక్వా రైతుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్తా

ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం నియోజకవర్గంలో ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ కొమరాడలో శనివారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొంతమంది ఆక్వా రైతులు, ఆక్వా జోన్లో లేరని, నాన్ జోన్‌లో ఉన్నారని అటువంటి వారికి విద్యుత్ రాయితీ ఉండని నేపథ్యంలో రైతుల కోరిక మేరకు సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఆక్వాపరంగా ఈ గ్రామంలో 40 మంది రైతులకు మూడేళ్లుగా రెండు కోట్ల 94 లక్షల 187 రూపాయల మేరకు లబ్ధి చేకూర్చడం జరిగిందన్నారు. జల జీవన్ మిషన్ పథకంలో గ్రామానికి సంబంధించి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు రూ.72 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే మూడు కిలోమీటర్ల మేర పైపులైను వేయడంతో పాటుగా ఓహెచ్ఆర్ కూడా నిర్మించామన్నారు. మరోపక్క ఇప్పటికే కొమరాడ, అనకోడేరు గ్రామాల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించేందుకు మెయిన్ ఛానల్ కాలువ నుండి డేగాపురం, కొమరాడ మీదుగా అనకోడేరు గ్రామ మంచినీటి చెరువులకు పైపులైను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సుమారుగా మూడు కిలోమీటర్ల మేర రూ.60 లక్షల నిధులతో ఈ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఈ పనులు త్వరలో పూర్తవుతాయని తెలిపారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలకు ఎంఎల్ఎ ఆదేశం..

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో కొమరాడలో ఎంఎల్ఎ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొదటి రోజే రూ.15 లక్షల నిధులతో నిర్మిస్తున్న పలు సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. కొమరాడ పేటలో సిసి రోడ్డు, గ్రావెల్ రోడ్డు, గరువులో సిసి రోడ్డు, అమ్మ కాలనీలో సిసి రోడ్డు, గణేష్ కాలనీలో, గొర్లమూడి లో సిసి రోడ్లు నిర్మాణాలకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరావు, జెడ్‌పిటిసి సభ్యులు కె.నరసింహారావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు గురు పురస్కారం

ప్రజాశక్తి - కాళ్ల

జువ్వలపాలెం ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జిటి ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న బొబ్బిలి రాజమౌళి కోటేశ్వరస్వామి స్పందన గురుపురస్కారం శనివారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. తూర్పుగోదావరి జిల్లా సూరంపాలెంలోని ఆదిత్య ఇంజినీరింగ్ క్యాంపస్ ఆడిటోరియంలో స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ స్పందన గురు పురస్కారం అందుకున్నట్లు తెలిపారు. సమాజంలో విద్యార్థులు, యువతలో పెట్రేగిపోతున్న నిరాశ, నిస్పృహలు, ఆత్మహత్యా ఆలోచనలను నుండి వారిని రక్షించే యోచనతో స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కృషి చేస్తోందన్నారు. ఎపి నిర్వాహకులు ఉభయగోదావరి జిల్లాల్లో సామాజిక బాధ్యతలో భాగంగా ట్రెండ్ విభాగంలో అంకితం భావం కలిగి, బోధనా రంగంలో విశేష అనుభవం కలిగిన ఉపాధ్యాయులను ఎంపిక చేశారన్నారు. నల్లమిల్లి శేషారెడ్డి, ఫౌండేషన్ ఛైర్మన్ ఈదా శామ్యూల్ రెడ్డి, రాజారావు, రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ నల్లమిల్లి సుగుణారెడ్డి, ఆదిత్య కాలేజ్ డైరెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నానన్నారు. ఈ సందర్భంగా రాజమౌళి కోటేశ్వర స్వామిని ఎంఇఒ రవీంద్ర, ప్రధానోపాధ్యాయులు ఎంవి త్రినాధులు, వి.రవీంద్ర అభినందించారు.

పాలకొల్లు : పట్టణంలోని జివిఎస్‌వి‌ఆర్‌ఎం పాఠశాలలో ఉపాధ్యాయుడు రాయపూడి భవానీప్రసాద్ కాకినాడ జిల్లాలోని సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ క్యాంపస్‌లో స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారిచే స్పందన గురు పురస్కారం అందుకున్నారు. స్పందనా ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ నిర్వాహకులు ఉభయగోదావరి జిల్లాల్లో సామాజిక బాధ్యతలో భాగంగా ట్రెండ్ విభాగంలో అంకితం భావం కల్గి, బోధనా రంగంలో విశేష అనుభవం కలిగిన ఉపాధ్యాయులను ఎంపికచేశారు. నల్లమిల్లి శేషారెడ్డి, ఫౌండేషన్ ఛైర్మన్ ఈదా శామ్యూల్ రెడ్డి, సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాజారావు, సుగుణ రెడ్డి అవార్డును అందజేశారు. భవానీ ప్రసాద్‌ను ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, యడ్ల తాతాజీ, రోటరీ, లయన్స్ క్లబ్ సభ్యులు అభినందించారు.

పోడూరు : పోడూరు మండల విద్యాశాఖాధికారి ఎఎస్‌కెవి.ప్రేమజ్యోతి, గుమ్ములూరు మండల పరిషత్ ప్రాథమిక ప్రధాన పాఠశాల ఉపాధ్యాయుడు కొల్లాబత్తుల సూర్యకుమార్ స్పందన గురు పురస్కారం అందుకున్నారు. శనివారం స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ ఈదా శామ్యూల్ రెడ్డి, ఆదిత్య సంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమం తూర్పుగోదావరి జిల్లా సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ ఆడిటోరియంలో జరిగింది. పురస్కారం అందుకున్న వారిని తోటి ఉపాధ్యాయ, సంఘ నాయకులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శనివారం తాడేపల్లిగూడెం కోర్టులో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 1006 కేసులు రాజీ అయినట్లు సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు తెలిపారు. క్రిమినల్ 232, సివిల్ 22, ఇపి 9, బెంచ్ కోర్టు 680, బిఎస్‌ఎన్‌ఎల్ 32, ఎస్‌బిఐ 3 మొత్తం 2006 కేసులు రాజీ అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు, జడ్జిలు ఎ.నాగమల్లేశ్వరి, సి.రమ్య, అరుంధతి, న్యాయవాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 549 కేసులు పరిష్కరించారు. ఒకటో బెంచ్లో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉషా లక్ష్మి కుమారి, రెండో బెంచ్‌లో అదనపు జూనియర్ సివిల్ జడ్జి భాను సాయి కేసులను పరిష్కరించారు. మొత్తం 549 కేసులు రాజీ చేసి, రూ.89,02,304 అందించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ మంగతాయారు, ఎపిపి జయ సింధు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ పాముల చిట్టిబాబు పాల్గొన్నారు.

తణుకురూరల్ : రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు తణుకు న్యాయస్థానాల ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో నాలుగో అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ వివిఎస్ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో న్యాయమూర్తులు 1030 కేసులను రాజీ చేశారు. 4 బెంచ్‌లుగా ఏర్పాటు చేసిన జాతీయ లోక్‌అదాలత్‌లో క్రిమినల్ కేసులు 187, మెయింటినెన్స్ కేసులు 3, సివిల్ కేసులు 16, బ్యాంకు, బిఎస్‌ఎన్‌ఎల్, ప్రిలిటిగేషన్ కేసులు 46, బెంచ్ కోర్టు 778 కేసులు రాజీ చేశారు. ఈ రాజీ కేసుల నిమిత్తం రూ. 2,49,95,290 విలువ గల కక్షిదారుల మధ్య రాజీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎ.నాగశైలజ, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.బాబు, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎవి.నాగరాజు, న్యాయవాదులు పాల్గొన్నారు.

భీమవరం : శనివారం స్థానిక కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 839 కేసులో పరిష్కరించినట్లు భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, 3వ అదనపు జిల్లా జడ్జి పి.సత్యాదేవి తెలిపారు. ఈ సారి ఎక్కువ కేసులు రాజీ చేసినట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు 33 భీమవరం టౌన్, రూరల్, వీరవాసరం, ఉండి, పాలకోడేరు, కాళ్ల, ఆకివీడు పోలీస్‌స్టేషన్‌లకు సంబంధించి క్రిమినల్ కేసులు 178, మనోవర్తి కేసులు 9, చెక్ బౌన్స్ కేసులు 31, బ్యాంక్ రికవరీ కేసులను రాజీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు సీనియర్ సివిల్ జడ్జి బి.అప్పలస్వామి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి డి.సోని, న్యాయవాదులు పాల్గొన్నారు.

పాలకొల్లులో వన సమారాధన



వన సమారాధనలో పాల్గొన్న జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాస్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మున్సిపల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం శనివారం తాళ్లూరి సుబ్బారావు అతిథి గృహంలో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, ఎస్‌సి కమీషన్ సభ్యులు చెల్లెం ఆనంద ప్రకాష్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, గుణ్ణం నాగబాబు, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నెక్కంటి సుబ్బారావు పాల్గొన్నారు. నిత్యం పని ఒత్తిడిలో ఉండే ఉద్యోగులు ఏడాదికి ఒకసారి ఇటువంటి వన సమారాధనలో కుటుంబ సభ్యులతో పాల్గొంటే మానసిక ఒత్తిడి నుంచి రిలాక్స్ అవుతారని నిమ్మల చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ వల్లభు నారాయణ మూర్తి, ఉద్యోగుల సంఘం నేతలు అల్లూరి శ్రీనివాస్ రాజు, ఈదా శ్రీరాజు, ఎంఆర్‌కె.ప్రసాద్, జి.సీతారాం, చందక కుమార్ రాజ, పి.శేఖర్ పాల్గొన్నారు.

పాలకొల్లు నటీనట సమాఖ్య ఆధ్వర్యంలో కళాకారుల వనభోజనాలు ఆదిత్య కళాశాల సమీపంలో శనివారం జరిగాయి. రాష్ట్ర కళాకారుల సంఘం అధ్యక్షుడు బుద్దాల రామారావు, ప్రసాదరెడ్డి, గుండా రామకృష్ణ, దాశిరెడ్డి శ్రీనివాస్, చవాకుల సత్యనారాయణ, అంబటి మురళి కృష్ణ, హరిబాబు, పలు కళా పరిషత్‌ల కళాకారులు హాజరయ్యారు.

జగనన్న లేఅవుట్లలో వసతులు కల్పించాలి : జనసేన

ప్రజాశక్తి - కాళ్ల

జగనన్న కాలనీ, లేఅవుట్లలో వసతులు కల్పించడంతోపాటు పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు తెలిపారు. శనివారం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జగనన్న ఇళ్లు - పేదలందరికీ కన్నీళ్లు పేరిట కార్యక్రమాన్ని జగనన్న కాలనీ, లేఅవుట్‌లు, ఇళ్ల వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమం నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు పర్యవేక్షణలో, మండల అధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు (రాము) ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం కాళ్ల గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న రెండు జగనన్న లేఅవుట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇళ్లు నిర్మిస్తానని ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక హామీ మరిచారని తెలిపారు. పేదలు అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టాల్సి వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాళ్ల ఉప సర్పంచి ఎస్.వెంకటేశ్వరరావు, ఎంపిటిసి పన్నాసి సూర్యకుమారి, మండల ఉపాధ్యక్షులు రాజేష్ పాల్గొన్నారు.

ఆచంట : జగనన్న కాలనీలో సరైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని జనసేన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ సెక్రటరీ చిట్టూరి శ్రీనివాస్ అన్నారు. శనివారం వల్లూరులోని జగనన్న కాలనీలను జనసేన నాయకులు పరిశీలించి అనంతరం కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కాలనీల్లో కనీసం రహదారులు లేకపోవడంతో ఇంటి నిర్మాణ సామగ్రి తీసుకెళ్లడానికి లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించి కాలనీల్లో డ్రెయినేజీ, కరెంటు, తాగునీరు, రహదారులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాయింట్ సెక్రటరీ రావి హరీష్, గ్రామాధ్యక్షులు కడిమి ఉమామహేశ్వర స్వామి పాల్గొన్నారు.

తణుకు : గొప్పలు చెప్పుకుంటున్న వైసిపి ప్రభుత్వం జగనన్న కాలనీల్లో కనీస మౌలిక వసతులు కూడా కల్పించలేని స్థితిలో ఉందని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి విడివాడ రామచంద్రరావు అన్నారు. శనివారం పవన్‌కళ్యాణ్ పిలుపు మేరకు జగనన్న ఇళ్లు పేదలకు కన్నీళ్లు కార్యక్రమంలో భాగంగా విడివాడ ఆధ్వర్యంలో జనసైనికులు జగనన్న కాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చిక్కాల వేణు, ఆకేటి కాశి, పంతం నానాజీ, గర్రె తులసీరామ్ పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేవని జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు విమర్శించారు. పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు శనివారం స్థానిక పైపులచెరువు రోడ్డు సమీపంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీని నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ ఇచ్చిన హామీల అమల్లో ప్రభుత్వం విఫలమైందన్నారు. కాలనీల్లో కనీస సౌకర్యాలు కలిపించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పిఎసి సభ్యులు కనకరాజు సూరి, పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, కార్యదర్శి సుంకర రవి పాల్గొన్నారు.

నిమోనియాపై ఎఎన్‌ఎంలకు అవగాహన

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఐదేళ్లలోపు చిన్నారుల్లో నిమోనియా ఉన్న వారిని గుర్తించి పేర్లు నమోదు చేసుకోవాలని మార్టేరు పిహెచ్‌సి డాక్టర్ కె.కార్తీక్ అన్నారు. శనివారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఎఎన్‌ఎంలకు సోషల్ అవేర్నెస్ అండ్ ఆక్షన్ టు న్యూట్రలైజ్ నిమోనియం (ఎస్‌ఎఎన్‌ఎస్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తిక్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపల ఉన్న చిన్నారులకు నిమోనియ ఉన్నట్లయితే వారిని పరీక్షించి, మందులు అందజేయాలన్నారు.

మావుళ్లమ్మ సన్నిధిలో తెలంగాణ హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలోని మావుళ్లమ్మను శనివారం తెలంగాణ హైకోర్టు జడ్జి జి.అనుపమ చక్రవర్తి దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులు, ఆలయ ధర్మకర్తలు రామాయణం సత్యనారాయణ మావుళ్లమ్మ అమ్మవారి ప్రతిమను అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు ముత్యాల వెంకట రామారావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామి సన్నిధిలో ఇన్ఫర్మేషన్ కమిషన్ ఛైర్మన్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పంచరామ క్షేత్రాల్లో ఒకటైన సోమేశ్వర జనార్ధన స్వామిని రాష్ట్ర ఇన్ఫర్మేషన్ కమిషన్ ఛైర్మన్ ఐలాపురం రాజా సతీసమేతంగా శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు కమిషనర్ దంపతులకు స్వాగతం పలికారు. కమిషనర్ దంపతులకు స్వామివారి అమ్మవార్ల చిత్రపటంతో పాటు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం మావుళ్లమను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ అరుణకుమార్ పాల్గొన్నరు.

నేడు మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - ఉండి

ఎంఎల్ఎ మంతెన రామరాజు పుట్టినరోజు సందర్భంగా కోట్ల ఫంక్షన్ హాల్లో ఆదివారం హోప్ ఛారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలుగు యువత ఉండి నియోజకవర్గ అధ్యక్షులు హరి నాయుడు వెల్లడించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఎ రామరాజు పుట్టినరోజు సందర్భంగా దాదాపు 100 మంది టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ రక్తదాన శిబిరంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ శిబిరం వల్ల ఎంతో మంది పేదవారికి, అత్యవసర కేసులకు, తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ శిబిరంలోని రక్తాన్ని ఆనంద బ్లడ్ బ్యాంకు ద్వారా శుద్ధి చేసి నిల్వ ఉంచడం జరుగుతుందన్నారు. రామరాజు పుట్టినరోజు సందర్భంగా మరిన్ని సేవా కార్యక్రమాలు కూడా చేస్తున్నట్లు వారు తెలియజేశారు.

ఛాంబర్స్ కాలేజీలో జిల్లా స్థాయి పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈనెల 14న బాలల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో వివిధ రకాల అంశాలపై పోటీలు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. తెలుగు, ఆంగ్లం, కంప్యూటర్, భౌతిక, రసాయన శాస్త్రాలు, జీవ జంతు శాస్త్రాలు, వాణిజ్యశాస్త్రం విభాగాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. దీనికి ఇంటర్ రెండో సంవత్సరం చదివే విద్యార్థులు అర్హులని తెలిపారు. ఇప్పటికే అంశాలపై అవగాహన కోసం కళాశాలలకు లేఖలు పంపినట్టు తెలిపారు. విద్యార్థులు 14వ తేదీ ఉదయం 9 గంటలకు కళాశాలకు చేరుకోవాలని కోరారు. అన్ని అంశాలకు తగినట్లుగా సమయం కేటాయించామని ఒకటి, రెండు, మూడు అంశాలలో పాల్గొనవచ్చని తెలిపారు.

ప్రజాస్వామ్యం ఖూనీ : పితాని

ప్రజాశక్తి - పోడూరు

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని, కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. పోడూరు, గుమ్ములూరులో శనివారం బూత్ కన్వీనర్, కో కన్వీనర్‌తో మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి రుద్రరాజు రమేష్ రాజు అధ్యక్షతన పితాని సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోకుండా అప్రమత్తం చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. 2023 సవరణ ఓటర్ల జాబితాలో మృతులు, డబుల్ ఎంట్రీ, వేరే ప్రాంతాలకు వెళ్లిన ఓటర్లు, వేరే ప్రాంతాల నుంచి కొత్తగా వచ్చిన ఓటర్ల వివరాలు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అధికార ప్రభుత్వం తమ అనుకూల ఓటర్ల మినహా మిగిలిన వారి ఓట్లు తొలగించే ప్రక్రియ వాలంటీర్ వ్యవస్థ ద్వారా జరుగుతోందన్నారు. కొత్త జాబితా తప్పుల తడకగా ఉందని, సవరణ చేయడంలో టిడిపి కీలక పాత్ర పోషించాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, రుద్రరాజు రవిరాజు, గణపతినీడి రామమోహన్, దొంగ సూర్య ప్రసాద్, రుద్రరాజు సుబ్రహ్మణ్యం రాజు పాల్గొన్నారు.

విష్ణులో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలోని విష్ణు ఇంజినీరింగ్ కాలేజీ శనివారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమం సాయంత్రం 6 గంటలకు కళాశాల లోని ఓపెన్ ఆడిటోరియంలో నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరాజు ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, నాట్య ప్రదర్శనలు ప్రదర్శించి సభికులను మైమరిపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.